# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ఇంటింటికీ సౌర విద్యుత్ సదుపాయాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల విషయంలో ఆందోళన పడాల్సిన అవసరం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
- ❖ యువతకు ఉపాధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు.
- ❖ నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================

రాష్ట్రంలో ఇంటింటికీ సౌర విద్యుత్ వెలుగులు అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అదే విధంగా తాగునీరు, డ్రైయినేజి, వంట గ్యాస్, ఇంటర్నెట్ సహా అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో ఈ రోజు నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పేదరికం లేని సమాజాన్ని చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

పెన్షన్ల పంపిణీలో భాగంగా కొత్త గొల్లపాలెంలో బత్తుల జాలమ్మ ఇంటికి వెళ్లి వితంతు పింఛన్ ను ముఖ్యమంత్రి అందజేశారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్దిదారు సుభాషిణి ఇంటికి వెళ్ళి పింఛన్ అందించారు.

======================

యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు. అదే విధంగా ప్రతి మండలానికి జిల్లాకు ఎన్ని ఉద్యోగాలు కల్పించామో తెలుసుకునే విధంగా ఆన్ లైన్ చేయడం జరుగుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ రోజు ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా లో మంత్రి మాట్లాడుతూ... జాబ్ మేళా ద్వారా 32 కంపెనీలు ద్వారా 1,200 ఉద్యోగాలకు అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలకు సరైన నైపుణ్యం గల అభ్యర్థులను అందించేందుకు శిక్షణను అందిస్తున్నామని చెప్పారు. ఇండస్ట్రియల్ పార్క్ ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా వెల్లడించారు. తెలిపారు. రాష్ట్రంలో గడచిన 9 నెలలలో 7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకురాగలిగామని అచ్చెంనాయుడు తెలిపారు.

======================

తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల విషయంలో ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయితో పోలిస్తే ఈ కేసులు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని స్పష్టం చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో సమగ్ర క్యాన్సర్ సర్వేను ప్రారంభించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

======================

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆదివాసీ గిరిజనులు చేపట్టే ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాహాయం అందిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. రాజబాబు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న 5 లక్షల 99 వేల ఇళ్ల నిర్మాణాలను లబ్దిదారులు పూర్తి చేసుకునేందుకు వీలుగా 3,220 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లుగా వెల్లడించారు. ఈ అదనపు ఆర్థిక సాయం నాలుగు విడతలలో లబ్దిదారుల వ్యక్తిగత ఖాతాలకు నేరుగా జమ చేయబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని లబ్దిదారులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

======================

దశల వారీగా కొత్త బస్సులను అన్ని డిపోలకు కేటాయిస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో నూతన బస్సును మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. రాష్ట్రాన్ని గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ముఖ్యమైన ప్రాంతాలకు మరింత విస్తృతమైన రవాణా సదుపాయాలు అందిస్తామని మంత్రి తెలిపారు.

విరామం

======================

తిరుపతి రైల్వేస్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్ మొదటి దశ పనులను ఈరోజు రైల్వే శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైల్వేస్టేషన్ నూతన టెర్మినల్ భవనాన్ని మే నెలలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. 300 కోట్ల రూపాయలతో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరవు ప్రభావిత మండలాలు గుర్తిస్తూ.. రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరవు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించింది. వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సిసోడియా తెలిపారు. కరవు నిర్వహణ నిబంధనల ప్రకారం, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, ప్రభుత్వం వేసవి ఇబ్బందులను అరికట్టేందుకు అవసరమైన నిధులతో పాటు సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

=====================

రబీ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో కర్నూలు జిల్లాలోని 9 మండలాలకు స్థానం లభించింది. 2024-25 రబీ సీజన్ లో కరవు ప్రభావిత మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లాలోని ఆస్పిరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలను తీవ్ర కరవు ప్రాంతంగా గుర్తించిందని అధికారులు తెలిపారు.

=====================

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని గుంతకల్లు రైల్వే డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అనంతపురం రైల్వే స్టేషన్ లో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో అమృత్ భారత్ పథకానికి 17 రైల్వే స్టేషన్లు ఎంపిక అయ్యాయని తెలిపారు. సుమారు 446 కోట్ల రూపాయల అంచనాతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

=====================

విజయనగరం జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతామని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. వచ్చే మూడు నెలల కాలంలో గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పశువులకు నీటితొట్టెలను నిర్మించడం, సేద్యపు నీటికుంటలు నిర్మాణం, పంట కాలువల పునరుద్దరణ, చెరువులు కుంటలను సమగ్రంగా అభివృద్ధి పరచడం వంటివి ఈ కార్యక్రమంలో చేపడతామన్నారు. ఉపాధి వేతనదారులకు దినసరి వేతనం 300 రూపాయలు వచ్చేలా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

=====================

విశాఖ జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి వార్షిక తిరుకళ్యాణ మహోత్సవం ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఈ నెల 30 న స్వామివారి చందనోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆహ్వానించారు. సింహాచలం ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సుబ్బారావు, దేవాలయ స్థానాచార్యులు టి.రాజగోపాల్ ప్రధాన అర్చకులు రమణాచార్యులు వేద పండితులతో ఈ రోజు అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

=====================

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

======================

======================